అన్నాడు. ఆమె అలా ఇలా దృక్కు తేల్చుకుంటూ ఐదురూపా య్యలు అందుకుంటూ "ఏమిటో అన్నానేగాని మీకంటె ఎక్కువ తెలుసునా అండీ!" అంది. అందుకు సమాధానంగా శర్మ "అయితే కర్కాటకమా?" అని పునః కొంచబోయాడు గాని అంతలో పురిటిమంచం మీదనుంచి అతగాని మగనాలి తొంగి తొంగి ఇలా అంది. "అక్కగారూ! మనకంటె ఆయనకు వొక్క ఆకు యెక్కువ తెలియదండీ!" అని.

.... .... .... .... ....

## పువ్వాయమ్మ......పున్నెమా అంటా?

ఇదేంట్రా అబ్బా! ఉత్తికర్రే సిగురట్టింది!" అంటూ అత్యం తాశ్చర్యంగా పువ్వాయమ్మ ఓ వంటకట్టెను ప్రభాతన్నకు చూపించింది. అప్పుడే పట్టుకు వస్తూవుంది ఆ వంటకట్టెను అడితీ లోంచి ఆమె, కసాయివాని బారినుండి రక్షించిన మేకను ఎత్తు కొస్తూవున్నట్టు, ముద్దుగా, జాలిగా—"సూడబ్బా! ఇది అడితీ సిగురో అడివిసిగురో—వాళ్లు దీన్నికూడా గొడ్డలేసి పేడు సెయ్యబోతూవుంటే వూళ్ళాక్క నట్టుకొచ్చాను. గుట్టు అట్టడు గుది—అడితి సిగురే! అడివిసిగురైతే ఇంతకాలముంటుందా తుండు నంటిపెట్టుకొని, చెట్టుకొట్టేశాక? అడితీసిగురే! ఇదేంట్రా అబ్బా! ఉత్తికర్రే సిగురట్టింది: ఇదీ పళంగా పాత్తే వనాంతర మైపోద్దా? ఏం సెట్టొద్ది అంటావు! ప్రభాతన్నా!" అంది ఊ-చిగురుత్తాచూస్తూ ఎదరమనిషికి చూపిస్తూ. ప్రభాతన్న బెరడు గిల్లి మూచూచి ఆకుతుంచి చవిచూచి "ఆనడంలేదు. ఏంవిక్షమో!

ఏదో ! మారుజాతి గుట్లక్రిందిది లాగుంది. ఇసిత్రంగానే సిగు రట్టింది " అన్నాడు. పువ్వాయమ్మ " అంతకంటె యిసిత్రంగా వుంటుంది యిదెదిగి పువ్వు పూస్తే—నీసేత్తో పాతేసి పెడుదూ నాబాబా ! గునపం తీసికొస్తాను " అంటూ ఆ చిగురుపట్టిన తుండును ప్రభాతన్నకు అందిచ్చి, తాను గుడిసెలోకివెళ్ళి ఓ గునపం పుచ్చుకు—ప్రభాతన్న మఱోతూరి చిగురువంక చూచే ఇంతలో—తిరిగివచ్చింది.

పువ్వాయమ్మగుడిసె యీవలకువచ్చే వెనకాతలే ఆకుటీర ద్వారబంధం పట్టుకు పొంచిపొంచి మఱోపణతి వెలిసింది. ఆమె పేరు ఏమైతేం, ఆ పణతి పువ్వాయమ్మ కోడలు. మొన్న మొన్ననే అధీనం తప్పినపిల్ల. అన్నీ పోగుచేస్తే పద్దెనిమిది మీద ముప్పొద్దులకంటె ఎక్కువవుండదు కోడలియీడు.

ప్రభాతన్న గుడిసెవంక చూడకుండానే, పువ్వాయమ్మ అందిచ్చిన గునపంపుచ్చుకుని, పువ్వాయమ్మ చూపెట్టిన స్థలంలో గొయ్యితవ్వి ఉత్తి తుండును చిగురుపైకెట్టి, మొదలుకిందగ్రుచ్చి, పాతి, పాదుచేసి పైల్మాన్‌లా చేతులు దులుపుకుంటూవున్నాడు. పువ్వాయమ్మ కోడలితో " ఆలా సెమ్మాలా నిలబడకపోతే పొయివోరనున్న పడుచు చట్టితో నీళ్ళట్టుకొచ్చి, కుసిన్ని మొక్క కోసి, కుసిన్ని కుఱ్ఱాడి సేతులమీద పోస్తేం ? " అంది మాటలో కసరుకలిపి. కోడలు భయంతో పెద్ద కుండెడునీళ్లు ఆలా మోసు కొచ్చి కొత్తపాదులో ముంతెడునీళ్లు ప్రభాతన్న దోసిట్లో ముంతెడునీళ్లు వంచింది. ప్రభాతన్న—ఆ పదునెనిమిదేండ్లమీద ముప్పొద్దుల ముగుదను—" గులాబీ "ని చూచినట్టు అనండి! "గోవా"ను చూచినట్టు అనండి—ఆమెను అట్టే—కనుమొఱగ్గా

తిలకించేడు; చూపులో చూపుకలిపి పిల్లవెళ్ళిపోతూంటే వెన కాతలే పువ్వాయమ్మతో "ఆ పిల్లచేత రోజూ దీనికి నీళ్ళు పోయిద్దువా యిది మంచిగంధపుమాను అయితీరుద్ది. మాణిక్యాల పూలుపూసి కాసుద్ది" అన్నాడు. పువ్వాయమ్మ "అలా అను కునే కట్టబెట్టాను నాయనా దీనికీ నా కొడుక్కి.—ఏమని చెప్పు కోను. ఎవరితో మొరెట్టుకోను—సెట్టంత కొడుకు శివశివామంటా చెల్లిపోయినాడు నిరుడీరోజుల్లో—అది అంశే యీ తుండు సిగు రనుకుంటా పెంచమని బోధిస్తా! నీళ్ళేపోస్తుందో? నిప్పులే పోస్తుందో? ఉత్తి పొగరుమోతు—నీకు తీరుబాటు అయినప్పు డల్లావచ్చి యీ వృక్షాన్ని చూచిపోతూ అవుసరమైనప్పుడు కుసింత గొప్పుతవ్వుతూవుండు. నీ సెయ్యి కలిసిన మూర్తం ఎలాంటిదో- మొక్కజాజి తీగాకావచ్చు, రాజమానూ కావచ్చు" అంది.

ప్రభాతన్న "మరి రానేమోనేను. ఈ పొద్దు యుద్ధం లోకి వెడుతున్నాను. నా మీద ఆశెట్టుకోకు పిన్నమ్మా!" అన్నాడు నిస్పృహగా. పువ్వాయమ్మ "యుద్ధంలోకే బాబా? నన్నూ తీసికుపోదూ! బతికిపోతాను" అంది. ప్రభాతన్న "యుద్ధంలోకి వెళ్ళేవాళ్లు బతకడానికి వెళ్ళరు" అంటూ చిరు నవ్వుతో, పువ్వాయమ్మవంక, పువ్వాయమ్మ గుడిసెవంక, గుడిసె ముంగట అప్పుడే తాను పాతిన—మొక—మోడు దానివంక తాత్కాలికపు వీడ్కోలుచూపు చూచి వెళ్ళిపోయినాడు.

పువ్వాయమ్మకు ప్రభాతన్న వెనుపట్టి పెద్ద పేకుబల్లలా కాపడింది. వెనక్కి అంతలోనే పిలిస్తే ఏమనుకుంటాడో.... అని పిలవకుండానే...."యుద్ధంలోకి వెళ్ళినవాళ్ళంతా చచ్చి పోతారా? అంతా చచ్చిపోరు ప్రభాతన్నా! నీవు తప్పకుండా

బ్రతికి తిరిగివస్తావు! వచ్చినప్పుడుమాత్రం ఈ నిర్భాగ్యపు ముండని గాపకం పెట్టుకో" అంటూ స్వగతంగా అనుకుంది. అనుకుంటూ తానొకసారి నూతనపు మొలక యిలకకేసి చూచి గుడిసెలో ప్రవేశించింది.

....ఆ తరుణంలో గుడిసెలోని కోడలి యూహలు? భావాలు?....

పువ్వాయమ్మ గుడిసెలో ప్రవేశిస్తూనే కోడలితో "అణ్ణి సూసినావా?" కోడలు "సూడకేం యుద్ధంలోంచి తిరిగి రావాలిగా!"....కోడలిమాట ఆవఅకెన్నడూ అంతవొద్దుగ్గా వినబడ లేదు పువ్వాయమ్మకు. పువ్వాయమ్మ "నాకేంటో....ఆడి ముఖ లక్షణమంతా అచ్చు మీ మాంవగారివరుస. వెన్నుతీరు కుర్రోడి మచ్చు." కోడలు "బావయ్యాదికూడా మాంవయ్యాపోలికే నంటగా" పువ్వాయమ్మ "ఊఁ. నీవూ ఊకొట్టావు!" కోడలు "ఈ యేలమరి పొయిలోకి పుల్లలు?" పువ్వాయమ్మ "ఆటి యూనే మరిసిపోనాను : నా బతుగ్గాల! ఈ సిగురుట్టిన తుండు కాపడ్డంతోనే లోకమంతా పెళ్లన వూరేగుతున్నట్టనిపించింది. ఈ పూట కాసితుకూ ఆసిత్రీ పొట్టూపెట్టికానియ్యి. నాకు మావేంద్రంగావుంది, వొళ్ళూ వూపిరి....ఎంచేతో? కోడలు "ఎంచేతేంటి? నీది నీవు నాది నేను పంచేసుకుందామంటే తెగ నివ్వవు! వేంద్రంగా వుండదూ?" పువ్వాయమ్మ "ఓహో! ఒఖందు కనుకుంటే ఒకెందుకెట్టురొష్టు. నా మొగుడూ, నీకు పోయినట్టే, పోయినాడు. కాకపోతే తేడా నాకో గుడ్డుకలిగాడు. నీ ఖర్మం నీకుట్టలేదు. నేనేంచేసేది. "కోడలి కెక్కడలేని దుఃఖం వచ్చేసింది. ముత్యాంల్లాంటి ఆమె కన్నీళ్ళు అప్పుడే

గుప్పుమన్న పౌయిమంట దిగతీతనేపడుతూ చుంయి చుంయి మన్నాయి. పువ్వాయమ్మ " ఏడవక ! రోజూ ఆ కొత్తగా పాతిన మొక్కకు ముంతెడు నీళ్లోస్తూ మొక్కేవా మూడోనాటికి బుచ్చిగా దొకడు పుట్టుకొస్తాడు. ఇదేం గొడ్డు లోకంకాదు. ఎన్ని విద్యా లైనా ఎంత పజ నాశనమైనా మళ్ళామళ్ళా కడుపున పుడతా వుంటారనే శాస్త్రం " అంది.

అత్తగారి వుపన్యాసానకు కోడలు కుదుటబడి, రోజూ ఆ మొక్కకు నీళ్లపోస్తూ క్రమక్రమంగా నలుగురెదటాపడి ఓ వెలుగుమళ్ళీ వెలువసాగింది. నడకలో మునపటి నాణ్యం ; పలుకులో వెనుకటి విలువ తొలగిపోనట్టే అందఱకూ ఆగ పడుతూ వచ్చాయి.

నాటినతుండు చిగురు తొలేట రివట్లోసి, మలి ఏట రెమ్మ వేసి. మూడో ఏటికల్లా మానుకట్టి, నాలుగోఏట చేవెక్కి చిత్రంగా పూతట్టి ఆలాఆలా ఎనిమిదేళ్ళపాటు తనవంటిచెట్టు మరిలేదన్నట్టు విరిస్తే విరక్కుండా, వర్ధిల్లింది, చెట్టుపేరు మాత్రం ఒకళ్ళకూ ఆ చుట్టుపట్లవాళ్ళకు అంకలేదు ఎంత సాధిం చినా, అయినా దానిపేరు తెలిసికొందామనే దృష్టిగల మాన వులూలేరు. " ఎదోచెట్టు ! నీడిస్తోందా లేదా ? అదేశాన " అన్నట్టు దానిక్రిందకు చేరుకుంటూ పదిమందీ చెట్టునుమఱచి ఏ కథ పట్టో చెప్పుకోవడం, దాంతో తెల్లాఱడమో, సందెలడ్డమో ఇదీ పరిపాటీ, చెట్టుచుట్టూ ఓ దిమ్మేసింది పువ్వాయమ్మ. కోడలాదిమ్మ వారంవారం అలికి ముగ్గెట్టి మోహనం గావించేది. మరి చెట్టు కిందకు చేరినవాళ్ళ నెయ్యాలూ తియ్యాలూ గుడిసె లోని తిరగమోతల్ని మించివుండేవి.

అప్పట్లో ఆ యుద్ధం ప్రభాతన్న వెళ్ళినప్పటికే మూడే ళ్ళయి మొదలెట్టి మరి ఎనిమిదేళ్లు అవిరళంగా జరిగి, పదకొండో ఏటితో సమాప్తం అయింది. ఇరుపక్షాలవారికీ సంధి కుదిరింది. మరి లోకంలో ఎన్నటికి ఎక్కడా పోరితం వుండడానికి అవకాశం లేదు. అన్నంత ఐకమత్యత అన్ని దేశాలవారికీ ఏర్పడిపోయింది.

సంధికుదిరి చక్కబడ్డ యీవల మాపుల్లో వొమాపు అత్తాకోడళ్ళిద్దరకీ ఒకరిక్కాకపోతే ఒకరికైనా కంటిమీద కునుకడలేదు.

అన్నట్టు చెప్పడం మరచిపోయాను. వాకిట్లో చెట్టింకా ఏణ్ణర్ధం ఎత్తరికాకుండానే పువ్వాయమ్మకో కానుపు, పువ్వాయమ్మ కోడలికో కానుపు, మారుమనువు వూసులేకుండానే కలిగి ఇద్దరికీ చెరో కొడుకూ నిలిచారు. ఆ బొట్టెలిద్దరూ నిత్యం సమవయస్కుల్లా ఇంతై అంతై ఎంతకైనా చాలుదురన్నట్లు ఒకళ్ళతో వొకళ్లు గుద్దులాడుకుంటూ అప్పటికప్పుడే చెట్టాపట్టా వేసికుంటూ తమతమ తల్లులకు వినోదం గొలుపగలిగారు. ఎవరూ తనను అడక్కుండానే పువ్వాయమ్మ "అడవిలో తుండొచ్చి అడితీలో ఏలా సిగురట్టిందో ఆలా పుట్టుకొచ్చారు. నాకు వీడూ, నాకోడలికి వాడూను అని ఆ చెట్టోసామ్యంగా మిన్నుముట్టేలా బాహటంగా ప్రకటించేది. ఆ వుపమానం ఆపె చెబుతూవుంటే బలే నమ్మిగ్గా వుండేదిలేండి ! ఆవంక సూడాకుండావుండిన వాడొక్కడు లేడనుకోండి....

ఓమాపు అత్తాకోడళ్ళకు కంటిమీద కునుకడలేదన్నాను ! ఆమాపు పొద్దోడవడంలో చెట్టుమీద కాకుల కావుకావు రోజూకన్న ఎక్కువగా వినబడింది. అత్తాకోడళ్ళిద్దరూ చెట్టుకిందకొచ్చి

ఈపొద్దు మహా అరుస్తున్నాయి మండాకాకులు. చుట్టం ఎవ డొస్తాడో ?" అని అనుకుంటూ తలుపు ఈవల గొళ్లెం నెట్టుకు తలో పనిమీద వూళ్లోకి వెళ్ళారు.

కుఱ్ఱవెధవ లిద్దరూ తల్లులు వెళ్ళగాజూచి పరస్పరం కొట్టుకోసాగారు. కొట్టుకొంటూ వారు యుద్ధసమాప్తిని కడచిన రేత్రే తిరిగివచ్చి ఆ సమయానకు ఆ దారేపొయ్యే ప్రభాతన్నను తమ తగువు తీర్చమన్నట్టు కేకేశారు. ప్రభాతన్న తానూ ఆపని మీదనే వాళ్ళదగ్గరకు చేరుకున్నట్టు చేరుకుంటూ బొట్టెల్నిద్దర్నీ చెరోచంకనూ ఎత్తుకొని తాను మున్నునాటిన చెట్టుకొనలుచూస్తూ మొదట దిమ్మమీద సుఖాసీనుడయ్యాడు. అయి కుఱ్ఱవాళ్ళతో "లోకంలో మరి పోరితం వుండదనుకున్నాను. మీ రిద్దరూ ఇప్పుడు కొట్టుకొంటూ వుండడంచూస్తే ఆ ఆశపోతూవుంది నాలో. ఎవరి పిల్లలు మీరు ? ఒకరి నొకరు కొట్టుకోబోకండి" అని బోధించాడు. బోధిస్తూ తన మిలటరీకోటు బొత్తాల మెఱపు వాళ్ళకక్కాఱపడేలా, బోరకు వాళ్ళిద్దర్నీ హత్తుకుని ముద్దు పెట్టు కొని పంపించేశాడు.

ఆ కుఱ్ఱలు ఆ ముద్దుకు మురిసిపోతూ పరుగెత్తుకు వెళ్ళి నట్టు వెళ్ళి వెళ్ళి ఎవరితల్లిని వాడు తీసికొని వస్తూ "అమ్మా ! ఆడెవరే ?" అంటూ అడుగజొచ్చారు. అత్తాకోడళ్ళిద్దరూ ప్రభా తన్నను చూస్తూ సిగ్గుపడిపోయారు.

"పువ్వాయమ్మా ! నీ పున్నెమాఅంటా మృత్యువును జయించి రాగలిగాను. గడియగడియకు ఈ చెట్టు గాపకంవచ్చి సంజీవిలా పనిచేసింది నా మీద రణరంగంలో" అన్నాడు

ప్రథాతన్న. పువ్వాయమ్మ "చెట్టు ఘనమైన చెట్టేబాబా! కాని నేనూ నా కోడలూకూడా, ఏమనిచెప్పను, నీతికి చెడిపోనాం!" అంటూ కంట తడిపెటుకుంది.

.... .... .... .... ....

## అస్సలైన కొల్లేటి చేప

గుళ్ళమీది మహర్షుల బొమ్మల్లా, ఎల్లావున్నవల్లా, మెళ్లైనా ఇటూ అటూ త్రిప్పకుండా, బారులుతీరి ప్రహారీగోడమీద రాంబందులు వందలాది కూర్చొని వున్నాయి. ఏక దృష్టులు, చుట్టపురాక నాడెక్కడా కానరాదేమీ అన్నమాదిరి వాసో వృక్షాల్ని నిశ్శబ్దంగా వుండి పోనాయి. కృష్ణగద్దలు గంధర్వ లోకంలోకో ఇంకా పైకో మాయమై వుండాలి అని అనుకొనేటంత పినీలంగా అంత ఒంత్రెత్తుగా ఆకాశం కనిపిస్తూవుంది.

ఆ గోడలమధ్యది, ఆ చెట్లచాటుది, ఆ ఆకాశం క్రిందిది ఏమిటని మీరూహిస్తున్నారో? ఏమిటని భావిస్తున్నారో? పాఠకులు! చేపలబజారు! తోయజాక్షులు తోక బుట్టలుచ్చుకు తొందఱ తొందఱగా ఆ వంకకు పోతూ పైని వివరించిన సూచల్ని కనిపెట్టి, యింకా రాలేనట్టుందిసరుకు. ఇంకా రాలేనట్టుంది సరుకు, అని తమ వొంటిమీది సరుకులు సవరించుకోవడంతో కొంత కాలక్షేపం పరిసరాన్ని గావించుకొంటూ వున్నారు.

అంతలో—ఆ ప్రహరీగోడలమధ్యను తభీమని గంప కుదేసిన చప్పుడైంది. గంప చప్పుడుతోపాటు గంగాలమ్మ చతికిల